నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, ఆదివారం 16 జూన్ 2024 | YADADRI BHUVANAGIRI

న్యాయవాద వృత్తిలో శిక్షణకు దరఖాస్తులు

యాదాద్రి భువనగిరి, జూన్ 15 (నమస్తే తెలంగాణ) : 2024-25 విద్యా సంవత్సరానికి న్యాయవాద వృత్తిలో శిక్షణ కోసం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఎస్సీ న్యాయవాద పట్టభద్రుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం.జయపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయశాస్త్రంలో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2లక్షలకు మించని ఎస్సీ అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో నెలకు రూ.3వేల స్టైఫండ్‌తోపాటు పుస్తకాలు, కంప్యూటర్, ఫర్నిచర్, లాయర్ డ్రెస్ కొనుగోలుకు రూ.50వేలు చెల్లించనున్నట్లు తెలిపారు.

వచ్చే నెల 6వరకు https ://telangana epass.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు పూర్తి బయోడేటాతోపాటు మీ సేవ ద్వారా పొందిన కులం, ఆదాయం ధ్రువపత్రాలు, పదో తరగతి నుంచి ఎల్ఎల్‌బీ మెమోలు, బార్ కౌన్సిల్ నమోదు పత్రాలను కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో వచ్చే నెల 6వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు సమర్పించాలని సూచించారు.

18నుంచి స్థాయీ సంఘాల సమావేశాలు

భువనగిరి కలెక్టరేట్, జూన్ 15 : జడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలను ఈ నెల 18నుంచి 20వరకు నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ కార్యాలయ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎన్.శోభారాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్‌కు సంబంధించిన ఏడు స్థాయీ సంఘాల సమావేశాలను మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఈ సమావేశాలకు జిల్లా స్థాయి అధికారులు ఆయా శాఖల పరిధిలోని సమగ్ర సమాచారంతో హాజరు కావాలని సూచించారు. 18న ఉదయం 10:30గంటలకు ఒకటవ (ఆర్థిక, ప్రణాళిక), ఏడవ (పనులు) స్థాయీ సంఘాల సమావేశం, మధ్యాహ్నం 12:30కు రెండవ (గ్రామీణాభివృద్ధి), 2:30 గంటలకు నాల్గవ (విద్య, వైద్య) స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.19న ఉదయం 10:30గంటలకు ఐదవ (మహిళా, శిశు సంక్షేమం), 11:30కు మూడవ (వ్యవసాయం), 20న ఉదయం 11 గంటలకు ఆరో (సాంఘిక సంక్షేమం) స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫామ్

ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభం

- జిల్లాలో తొలుత 491 అంగన్‌వాడీ స్కూళ్లలోనే..
- ఉమ్మడి జిల్లాలో 28,125 మంది చిన్నారులు
- జిల్లాకు చేరిన నాలుగు రకాల డ్రెస్ క్లాత్
- మహిళా సంఘాలకు స్టిచ్చింగ్ బాధ్యతలు
- వచ్చే నెలలో పంపిణీకి కార్యాచరణ

యాదాద్రి భువనగిరి, జూన్ 15 (నమస్తే తెలంగాణ) : అంగన్‌వాడీ స్కూళ్లలోనూ ఇక నుంచి యూనిఫామ్ ఉండనుంది. ప్రీ ప్రైమరీ స్కూళ్లలో చిన్నారులకు యూనిఫామ్ అందించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా.. ఈ ఏడాది నుంచే అమల్లోకి రానుంది. ఒక్కో విద్యార్థికి జత చొప్పున పంపిణీ చేయనుండగా.. ఇప్పటికే క్లాత్ జిల్లాకు చేరుకుంది. వచ్చే నెల మొదటి వారంలో యూనిఫామ్ పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రభుత్వ స్కూళ్లల్లో చదువుతున్న విద్యార్థులకు సర్కారు ఉచితంగా రెండు జతల యూనిఫామ్ అందిస్తున్నది. ఇందులో భాగంగా జిల్లాలో ప్రస్తుతం ఒక జత ఇవ్వగా, త్వరలో రెండో జత ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటి వరకు స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకే ఇస్తుండగా.. ఇక నుంచి అంగన్‌వాడీ స్కూళ్లలో చదువుతున్న చిన్నారులకు కూడా యూనిఫామ్ కుట్టించి ఇవ్వనున్నారు. ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో 3 నుంచి 5 ఏండ్లలోపు చిన్నారులు చదువుతుంటారు. జిల్లాలో మొత్తం 900 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, తొలుత స్కూళ్ల ప్రాంగణాల్లో ఉన్న 491 అంగన్‌వాడీల్లో ఇది అమలు చేయనున్నారు. మిగతావి రెండో దశలో అమలు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ సెంటర్లలో 28,125 మంది చిన్నారులు ఉన్నారు. ఇందులో యాదాద్రి జిల్లాలో 8,392, సూర్యాపేటలో 8,575, నల్లగొండ జిల్లాలో 11,158 మంది చిన్నారులు చదువుకుంటున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం కోసం

తెలంగాణ రాష్ట్రం వచ్చాక ప్రభుత్వ బడులు, అంగన్‌వాడీలు ఎంతో అభివృద్ధి చెందాయి. ప్రైవేట్ పాఠశాలలతో సమానంగా సదుపాయాలు కల్పిస్తున్నారు. సర్కారు బడుల్లో మంచి విద్య అందుతున్నది. అయితే అంగన్‌వాడీలను మరింత బలోపేతం చేయడానికి ఇప్పుడు యూనిఫామ్ సిస్టమ్ తీసుకొచ్చారు. ప్రభుత్వ విద్య, పాఠశాలలను ప్రోత్సహించడానికి అంగన్‌వాడీలను పటిష్టం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

నాలుగు రంగుల్లో క్లాత్..

చిన్నారుల యూనిఫామ్‌కు సంబంధించి ఇప్పటికే డిజైన్ ఫైనల్ చేశారు. నాలుగు రంగుల్లో క్లాత్ ఉండనుంది. రెడ్, యాష్, బ్లూ, వైట్ రంగుల్లో ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 19,237 మీటర్ల రెడ్ క్లాత్, 19,237 మీటర్ల యాష్, 10,398 మీటర్ల బ్లూ, 7,032 మీటర్ల వైట్ కలర్ క్లాత్ అవసరం పడుతుందని అంచనా వేశారు. జిల్లాకు ఇప్పటికే కొంత మేర క్లాత్ చేరుకుంది. క్లాత్‌ను టీఎస్ టెస్కో సరఫరా చేస్తున్నది.

మహిళా సంఘాలకు స్టిచ్చింగ్ బాధ్యత

యూనిఫామ్ కుట్టే బాధ్యతలను సెర్ప్‌కు ఇచ్చారు. మహిళా సంఘాల ద్వారా డ్రెస్‌లు కుట్టనున్నారు. దీన్ని డీఆర్‌డీఓ పర్యవేక్షించనున్నారు. ఇప్పటికే స్కూల్ విద్యార్థుల యూనిఫామ్ స్టిచ్చింగ్‌లో మహిళా సంఘాలు బిజీగా ఉన్నాయి. ఇప్పుడు అంగన్‌వాడీల పని దొరకడంతో మరింత బిజీ కానున్నాయి. మహిళలకు మరింత ఉపాధి లభించే అవకాశం ఉన్నది. స్టిచ్చింగ్‌కు ఒక్కో బాలిక యూనిఫామ్‌కు రూ.60, బాలుడికి రూ.80 చెల్లించనున్నారు. గతంలో ప్రైవేట్ టైలర్లకు అప్పగిస్తే అధిక సమయం తీసుకుంటుండటంతో మహిళా సంఘాలకే పని కల్పిస్తున్నారు.

వచ్చే నెల నుంచి యూనిఫామ్ పంపిణీ

అంగన్‌వాడీల్లో చిన్నారులకు యూనిఫామ్ కోసం జిల్లాకు నాలుగు రకాల క్లాత్ వచ్చింది. వీటిని మహిళా సంఘాల ద్వారా కుట్టించేందుకు చర్యలు చేపట్టాం. తొలుత ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణంలో నడుస్తున్న 491 అంగన్‌వాడీల్లో అమలు చేస్తాం. వచ్చే నెల నుంచి యూనిఫామ్ పంపిణీ చేస్తాం. అంగన్‌వాడీలను బలోపేతం చేయడానికి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

– కృష్ణవేణి, పీడీ, ఐసీడీఎస్

విద్యార్థిని శ్రావణిని అభినందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా ప్రేమజ్యోతి

శెభాష్.. శ్రావణి

- బీబీనగర్ విద్యార్థిని ఇన్‌స్పైర్ ప్రాజెక్టుకు పేటెంట్ హక్కు

బీబీనగర్, జూన్ 15 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2019 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థిని శ్రావణి ఇన్‌స్పైర్ పోటీల్లో భాగంగా (లైఫ్ సేవింగ్ స్టిక్ ఫర్ ఓల్డ్ పీపుల్) అనే సైన్స్ ప్రాజెక్ట్‌ను తయారు చేసింది. ఇది జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రాజెక్ట్‌గా ఎంపిక కాగా, ఆ ప్రాజెక్టుకు సంబంధించిన పేటెంట్ హ క్కులు భారత ప్రభుత్వం ద్వారా పొందారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా ప్రేమజ్యోతి శనివారం విద్యార్థిని శ్రావణిని అభినందిస్తూ సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఉత్తమ అధ్యాపక బృందం, ఆధునికమైన విద్యాబోధన, సకల వసతులతో కూడిన తమ పాఠశాల సేవలను మండల ప్రజలు వినియోగించుకోవాలన్నారు. అడ్మిషన్లు కొనసాగుతున్నాయని, తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు.

ఎంజీయూలో నిర్వహించిన పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవి, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆకుల రవి

ఎంజీయూలో తొలి పీహెచ్‌డీ ఎంట్రన్స్

- రాష్ట్ర వ్యాప్తంగా ఆయా కోర్సుల్లో 334 మంది అభ్యర్థుల హాజరు

రామగిరి, జూన్ 15 : పరిశోధనలకు అవకాశం కల్పించేలా నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో యూజీసీ నిబంధనల మేరకు శనివారం నిర్వహించిన తొలి పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష సజావుగా ముగిసింది. ఇప్పటి వరకు ఎంజీయూలో యూజీసీ నెట్, జేఆర్ఎఫ్, సెట్, నెట్ ఉన్న అభ్యర్థులకు నిబంధనల మేరకు ఇంటర్వ్యూలు నిర్వహించి వివిధ సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించారు. అయితే.. కొత్త నిబంధనల ప్రకారం సెట్, నెట్‌తోపాటు ఆయా కోర్సులకు సమానమైన పీజీ పూర్తి చేసిన అభ్యర్థులకు నేరుగా ఎంట్రన్స్ నిర్వహించి ప్రవేశం కల్పించేలా ఫిబ్రవరిలో నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో ఆన్‌లైన్‌లో 400 మంది అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించినట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆకుల రవి వెల్లడించారు. వారికి ఎంజీయూ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్స్ కళాశాలలో ఉదయం, మధ్యాహ్నం వేర్వేరుగా జరిగిన పరీక్షకు పేపర్-1 రిసెర్చ్ మెథడాలజీ అన్ని సబ్జెక్టులకు ఒక్కటే ఉండగా 400 మందికి 334 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 66 మంది గైర్హాజరయ్యారు. పేపర్-2 సబ్జెక్టు వారీగా పరీక్షలు నిర్వహించగా.. బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో 171మందికి 146 మంది, బయోటెక్నాలజీలో 22మందికి 19మంది, కామర్స్‌లో 94మందికి 81మంది, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేటిక్స్‌లో 50మందికి 43మంది, బయోకెమిస్ట్రీలో 10మందికి ఏడుగురు, గణితంలో 34మందికి 29మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్షల ప్రాథమిక 'కీ'ని ఈ నెల 21న వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. తుది 'కీ' జూలై 2న విడుదల చేస్తామన్నారు. పరీక్ష నిర్వహణపై అభ్యంతరాలను ఈ నెల 26లోగా వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్‌లో తెలియజేయవచ్చని పేర్కొన్నారు. పరీక్షలను డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆకుల రవితోపాటు ఎంజీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవి, ఓఎస్‌డీ టూ వీసీ కొప్పుల అంజిరెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి జి.ఉపేందర్‌రెడ్డి పర్యవేక్షణ చేశారు.

శాలిగౌరారం : వల్లాల పాఠశాలలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సర్కారు కృషి

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- నూతనకల్, వల్లాలలో బడిబాటకు హాజరు

నూతనకల్/ శాలిగౌరారం, జూన్ 15 : ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడానికి రాష్ట్ర సర్కారు కృషి చేస్తున్నదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అదేవిధంగా, శాలిగౌరారం మండలంలోని వల్లాల గ్రామ మోడల్ స్కూల్ విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్ల నుంచి యూనివర్సిటీల వరకు అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.22వేల కోట్లు మంజూరు చేసిందన్నారు. ఆ నిధులతో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. నూతనకల్ జడ్పీ పాఠశాలలో బాలికలకు మూత్రశాలలు, కంప్యూటర్ హాల్ నిర్మిస్తామన్నారు. పాఠశాలకు 10 కంప్యూటర్లు అందజేస్తానని, విద్యార్థులకు కంప్యూటర్ విద్య నేర్పించడానికి ప్రైవేటు టీచర్లను నియమిస్తామని హామీ ఇచ్చారు. వల్లాల మోడల్ స్కూల్‌లో వంట చేసేందుకు గ్యాస్ కనెక్షన్ల కోసం మంత్రి సొంతంగా రూ.2.50 లక్షలు అందజేశారు. ఆగస్టులో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నదన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు రూ.5లక్షలు కేటాయించి త్వరలో ఇండ్లను నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, అదనపు కలెక్టర్ ప్రియాంక, డీఈఓ అశోక్, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, ఎంపీపీ భూరెడ్డి కళావతి, జడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగ జయసుధ, ఎంపీటీసీ పన్నాల రమ, తాసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓ సునీత, ఎంఈఓ రాములునాయక్, శాలిగౌరారంలో జడ్పీటీసీ ఎర్ర రణీలా యాదగిరి, తాసీల్దార్ అన్వర్ హుస్సేన్, ఎంపీడీఓ లక్ష్మయ్య, ఎంఈఓ నాగయ్య, ఎంపీటీసీ మాదగోని కవిత, పాఠశాల ప్రిన్సిపాల్ రాగిణి పాల్గొన్నారు.

పీఈటీల పదోన్నతుల్లో నకిలీ సర్టిఫికెట్ల కలకలం

వ్యాయామ ఉపాధ్యాయ సంఘం, టీచర్ల ఫిర్యాదుతో వెలుగులోకి

- నల్లగొండ జిల్లాలో 12 మందికి పైగా ఉన్నారంటూ ఆరోపణలు
- పదోన్నతులు వద్దని కొందరు.. అందుబాటులోకి రాకుండా తిరుగుతున్న మరికొందరు
- నకిలీవని రుజువైతే శాఖాపరమైన చర్యలు : డీఈఓ

రామగిరి, జూన్ 15 : పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నత పౌరులుగా తయారు చేయాల్సిన ఉపాధ్యాయులు కొందరు పదోన్నతుల కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. పీఈటీల పదోన్నతుల జాబితాలో నకిలీ సర్టిఫికెట్ల విషయం జిల్లాలో కలకలం రేపుతున్నది. పీఈటీ నుంచి స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ ఉపాధ్యాయుల పదోన్నతులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేయడంతోపాటు ఈ నెల 10న డీఈఓ కార్యాలయంలో జరిగిన సర్టిఫికెట్ వెరిఫికేషన్స్ పూర్తి చేసుకున్నట్లు ఓ వ్యాయమ ఉపాధ్యాయ సంఘం నాయకులు కలెక్టర్, డీఈఓలకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

విద్యాశాఖ పదోన్నతుల్లో భాగంగా పీఈటీల అప్‌గ్రేడేషన్ ప్రక్రియకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దాంతో జిల్లా విద్యాశాఖ అధికారులు ఆ విభాగంలోని ఉపాధ్యాయుల సర్టిఫికెట్లు, సర్వీస్ బుక్‌లను ఈ నెల 10న నల్లగొండ డీఈఓ కార్యాలయంలో పరిశీలించారు. అయితే.. కొందరు ఉపాధ్యాయులు పీఈటీ నిబంధనలకు విరుద్ధంగా సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకుని అర్హత ఉన్నట్లుగా నిర్ధారణ చేయడంతో సీనియారిటీ జాబితాలో చోటు దక్కింది. దాంతో న్యాయబద్ధంగా ఉన్న ఉపాధ్యాయులు నష్టపోతున్నారని వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం, వ్యాయామ ఉపాధ్యాయులు జిల్లా కలెక్టర్, డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. దీంతోపాటు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయగా జిల్లాలో చర్చగా మారింది.

అడ్డంగా దొరికారు..

నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 124మంది పీఈటీలు స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ ఉపాధ్యాయుల పదోన్నతులకు ఈ నెల 10న డీఈఓ కార్యాలయంలో నిర్వహించిన సర్టిఫికెట్ వెరిఫికేషన్, సర్వీస్ బుక్ పరిశీలనకు హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. వీరిలో కొంత మంది లోకల్ బాడీ (జడ్పీ), ప్రభుత్వ విభాగంలో పనిచేస్తున్న పీఈటీలు ఇన్ సర్వీస్‌లో బీపీఈడీ చేశారు. అయితే.. ఆ కోర్సు కాల వ్యవధి సంవత్సరం ఉన్న సమయంలో జీఓ ఎంఎస్ నెం.17 ప్రకారం ఎన్ని రోజుల్లో కోర్సు పూర్తి చేశారనేది చూపకుండా బీపీఈడీ పూర్తి చేసినట్లు మాత్రమే చూపించినట్లు ఆరోపణలు వచ్చాయి. మరో వైపు జిల్లా వ్యాప్తంగా 12 మంది పీఈటీలు నకిలీ సర్టిఫికెట్లు, సర్వీస్ పుస్తకంతో పదోన్నతులకు అర్హత ఉన్నట్లు చూపించి పదోన్నతుల జాబితాలో చోటు దక్కించుకున్నారని, దాంతో అర్హతలున్న ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం (టీజీయూఎస్), వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘాల నేతలు కలెక్టర్, డీఈఓ దృష్టికి తీసుకపోవడంతో వెలుగులోకి వచ్చింది. ఇదిలా ఉంటే పదోన్నతుల్లో అడ్డదారి తొక్కిన 12మందిలో 8మంది ఉపాధ్యాయులు వెనక్కి తగ్గారు. మిగిలిన నలుగురిని డీఈఓ కార్యాలయంలో హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసినా రాకుండా పరారీలో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

విచారణ చేస్తున్నాం

కొంత మంది ఉపాధ్యాయులు నకిలీ సర్టిఫికెట్లు, సర్వీస్ బుక్‌లను చూపించారని ఉన్నతాధికారులకు వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఫిర్యాదు చేయడంతో మా దృష్టికి వచ్చింది. ఫిర్యాదు చేసిన నేతలు పేర్కొన్న టీచర్ల వివరాల ప్రకారం వారిని గుర్తించే ప్రక్రియ కొనసాగిస్తున్నాం. విద్యాశాఖ కార్యాలయంలో హాజరు కావాలని తెలిపినా కొంత మంది రావడం లేదు. తప్పించుకు తిరుగుతున్నారు. సదరు ఉపాధ్యాయులు చూపిన సర్టిఫికెట్లు, సర్వీస్ పుస్తకం నకిలీవి అని తెలితే వారిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటాం. అర్హులైన పీఈటీలందరికీ న్యాయం జరుగుతుంది. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– బి.భిక్షపతి, నల్లగొండ డీఈఓ

ఫైలాన్‌కాలనీ పోస్టాఫీసు ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

సబ్ పోస్ట్‌మాస్టర్ కాజేసిన నగదును చెల్లించాలి

- పోస్టాఫీసు ఎదుట బాధితుల ధర్నా

నందికొండ, జూన్ 15 : తమ పొదుపు ఖాతాలు, డిపాజిట్ల నుంచి సబ్ పోస్ట్‌మాస్టర్ కాజేసిన నగదును వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బాధితులు శనివారం ఫైలాన్ కాలనీలోని పోస్టాఫీసు ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు మాట్లాడుతూ ఫైలాన్ కాలనీలోని పోస్టాఫీసులో తాము దాచుకున్న సుమారు రూ.1.5 కోట్ల రూపాయలను సబ్ పోస్ట్ మాస్టర్ రామకృష్ణ కాజేసినట్లు తెలిపారు. విషయాన్ని డిసెంబర్‌లో గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, స్థానిక విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారు. విచారణ చేపట్టిన పోస్టల్, పోలీస్ అధికారులు ఖాతాదారుల డబ్బులను త్వరలో వారి ఖాతాల్లో జమ చేస్తామని చెప్పి ఆరు నెలలు దాటినా నేటికీ జమ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై అడిగితే పోస్టల్ అధికారులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. విషయాన్ని జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు వస్తాయో రావోనని తీవ్ర మనోవేదనకు గురై ఓ ఖాతాదారుడు గుండా మల్లికార్జున గుండెపోటుతో మరణించాడని తెలిపారు.

ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పోస్టల్ అధికారులపై చర్యలు తీసుకొని తమ ఖాతాల్లో నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో బాధితులు చిన్నయ్య, రవి, మధు, సంపూర్ణమ్మ, లక్ష్మి, చెన్నకేశవులు, సుబ్బారావు, శివ, సదాశివరెడ్డితోపాటు పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు.

కర్నల్ సంతోష్‌బాబు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు, మాజీ సైనికులు

మహా వీరచక్ర కర్నల్ సంతోష్‌బాబుకు ఘన నివాళి

- సంతోష్‌బాబు వర్ధంతిలో పాల్గొన్న కుటుంబ సభ్యులు, మాజీ సైనికులు

బొడ్రాయిబజార్, జూన్ 15 : మహా వీరచక్ర కర్నల్ సంతోష్‌బాబు 4వ వర్ధంతిని ఎన్‌సీసీ తెలంగాణ 31వ టెటాలియన్ ఆధ్వర్యంలో శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సంతోష్‌బాబు విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు, ఎన్‌సీసీ అధికారులు, మాజీ సైనికులు, పట్టణ ప్రముఖులు సంతోష్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ తెలంగాణ 31వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కర్నల్ లక్ష్మారెడ్డి, మాజీ సైనికుడు కర్నల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ భారతదేశం గర్వించదగిన గొప్ప సైనికుడు కర్నల్ సంతోష్‌బాబు అని కొనియాడారు. సంతోష్‌బాబు చేసిన త్యాగం దేశ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఆయన వీరత్వాన్ని గుర్తు చేసుకుంటూ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వహించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఆర్మీలో పని చేస్తున్న వారు చాలా తక్కువగా ఉన్నారని, దేశ రక్షణకు యువకులు అగ్ని వీరులుగా ముందుకు రావాలని కోరారు. సంతోష్‌బాబు మన మధ్య లేకున్నా ఆయన త్యాగం దేశ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో సంతోష్‌బాబు సతీమణి సంతోషి, తల్లిదండ్రులు బిక్కుమళ్ల ఉపేందర్, మంజుల, కుటుంబ సభ్యులు తల్లాడ వెంకటేశ్వర్లు, ఎన్‌సీసీ కెప్టెన్ వి.వెంకటేశులు, సుబేదార్ మేజర్ మాధవరావు, మాజీ సైనికులు, ఎన్‌సీసీ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాహో.. సాలమ్మ!

- 105 ఏండ్ల వయసులోనూ తన పనులు తానే చేసుకుంటున్న అవ్వ

భూక్య సాలమ్మ

గుండాల, జూన్ 15 : ఆ అవ్వ వయస్సు 105 ఏండ్లు. అయినప్పటికీ నేటికీ ఆరోగ్యంగా ఉంది. మండలంలోని కొమ్మాయిపల్లి గ్రామ పరిధిలోని లక్ష్మీతండాకు చెందిన భూక్య సాలమ్మ ఇటీవలే 105 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఆమెకు ఆరుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా ఇద్దరు కుమారులు మరణించారు. సాలమ్మ కుమారులు, కుమార్తెల సంతానం సుమారు 80 మంది వరకు ఉన్నారు. సాలమ్మ 4 తరాల వారసులను చూసింది. ఈ సందర్భంగా సాలమ్మ మాట్లాడుతూ.. నాడు జొన్నలు, సజ్జలు, కొర్రలు, రాగులు తిన్నందునే నేటికీ ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపింది. ఇప్పటి వరకు దవాఖానకు వెళ్లే అవసరమే రాలేదని చెప్పింది. ఇప్పటికీ ఇంటి పనుల్లో కుటుంబ సభ్యులకు సాయం చేస్తుంది. సాలమ్మను ఉద్దేశించి తండావాసులు మాట్లాడుతూ.. నేటి తరం వాళ్లు 30 ఏండ్లకే అనారోగ్యంతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారని, సాలమ్మ మాత్రం 105 ఏండ్లు వచ్చినా ఆరోగ్యంగానే ఉండడం గొప్ప విషయమని అంటున్నారు.

ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి బదిలీ

నల్లగొండ సిటీ, జూన్ 15 : ఆర్టీసీ నల్లగొండ జిల్లా రీజినల్ మేనేజర్ ఆర్.శ్రీదేవిని హైదరాబాద్ బస్ భవన్‌కు బదిలీ చేస్తూ ఆ సంస్థ ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ బస్ భవన్‌లో ఐటీ విభాగంలో చీఫ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న రాజశేఖర్‌ను ఆర్ఎంగా పదోన్నతి కల్పిస్తూ నల్లగొండకు బదిలీ చేశారు. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

జపాన్‌లో నర్సింగ్ పోస్టులకు ఉచిత శిక్షణ

నల్లగొండ రూరల్, జూన్ 15 : జపాన్‌లో స్పెసిఫైడ్ స్కిల్డ్ వర్కర్స్ కింద పని చేసేందుకు అర్హత కలిగిన నర్సింగ్ సిబ్బందికి శిక్షణ, నియామకాల కోసం తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తుందని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎన్.పద్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

టీఎంసీఓఎం ద్వారా శిక్షణ తీసుకోబడిన 2 బ్యాచ్‌ల నర్సింగ్ అభ్యర్థులు 31 మంది ఇప్పటికే జపాన్‌లో పలు ఆసుపత్రుల్లో పని చేస్తున్నారని తెలిపారు. మూడో బ్యాచ్ నర్సింగ్ అభ్యర్థులు టీఓఎంసీఓఎం ద్వారా శిక్షణ తీసుకుంటున్నారని, తదుపరి బ్యాచ్‌ల అభ్యర్థుల ఎంపిక కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 20 వరకు గడువు ఉన్నదని తెలిపారు.

22 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల బీఎస్సీ నర్సింగ్, డిప్లమో, పారామెడికల్, ఫార్మాస్యూటికల్ అభ్యర్థులు ఈ ప్రోగ్రామ్ కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9951909863, 6302292450 నెంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.